

# యండమూరి కథాస్రవంతి

– డా.యండమూరి వీరేంద్రనాథ్



# తోడేలు

ఆకాశ దేశాన వ్యాహ్యాళికి వెళుతున్న ఇంద్రుణ్ణి ఏడిపించటం కోసం, వరుణుడు నల్లటి మేఘాల్ని సృష్టించగా, కోపం వచ్చిన ఐరావతం తన కాళ్ళతో వాటిని చిన్నాభిన్నం చేసి, తొండంతో ఆ నీటిని భూమ్మీదకు వెదజల్లినట్టు వర్షం ధారాపాతంగా కురుస్తోంది.

రహదారి బంగళా అడవి మధ్యలో ఉంటుంది. దానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఒక పల్లెటూరు. ఆ పల్లెటూర్లో మా బ్రాంచి స్థాపించాలని వచ్చి ఇక్కడ దిగాను. దాదాపు రెండు వేల కోట్ల రూపాయల ప్రాజెక్టు. అన్నీ సవ్యంగా జరిగితే నా సంస్థ భారతదేశంలో నెంబర్ అవుతుంది.

వరండాలో స్థంబానికి ఆనుకొని ఎడతెరిపి లేకుండా కురుస్తూన్న వర్షాన్ని చూస్తున్నాను. పురాతనమైన బంగళా కావటంతో తడిసిన చెక్కల వింత పరిమళం గమ్మత్తుగా ఉంది. మెరిసినప్పుడల్లా చెట్లు భయంకరంగా తలలూపుతూ రోమాల్ని నిక్కబొడుచుకునేలా చేస్తున్నాయి. వాన హోరూ, మధ్యలో ఉరుముల చప్పుడూ..! కరెంటు పోకపోవటం అదృష్టం.

గోడమీద ‘మానస మందిరం’ అని చెక్కబడి ఉంది. రహదారి మందిరాలకి అలాంటి పేర్లు ఉండటం చాలా అరుదు. ఈ భవంతి కట్టించిన వాళ్ళెవరో కానీ మంచి అభిరుచి ఉన్నవారు అయి ఉంటారు. రెండు గదులూ, మధ్యలో పెద్ద హాలూ, పురాతనమైన ఫర్నీచరూ, కాంపౌండులోనే దూరంగా వాచ్మెన్ ఇల్లు.

అంతలో ఒక ఉరుమూ, దాన్ని అధిగమించి ఏదో జంతువు అరుపూ వినిపించింది. ఉలిక్కిపడ్డాను. కాంపౌండ్ వాల్ ఎత్తుగా ఉంది కానీ, అప్పుడప్పుడు నక్కలూ, బావురు పిల్లులూ గోడ దూకి వస్తూ ఉంటాయని వాచ్-మాన్ చెప్పాడు. మళ్ళీ అదే జంతువు అరుపు వినబడింది. బావురు పిల్లిది కాదు. నక్క ఊళ కూడా కాదు. ఏమిటా జంతువు?

బయట నిలబడటం మంచిది కాదనిపించి వెనక్కు తిరగబోతూ ఉండగా గోడ మీద నుంచి ఏదో లోపలకు దూకిన సవ్వడి వినిపించింది. చూశాను. దాదాపు అయిదడుగుల ఎత్తులో భయంకరంగా ఉంది.

తోడేలు.

నా ఊపిరి ఆగిపోయింది. దాని కళ్ళ నీలపు రంగులో, మధ్యలో ఎర్రటి జీరలతో మెరుస్తున్నాయి. దొరికిన జంతువు ఎటూ వెళ్ళిపోలేదని నిశ్చయమైన తరువాత, దాన్ని కబళించటానికి తాపీగా ఆగినట్టూ అది నిశ్చలంగా ఉన్నది. నా కాళ్ళు నేలకు అతుక్కు

పోయాయి. ఊహించనంత వేగంతో అది ముందుకు వచ్చింది. నేనెంత స్థంబించిపోయానంటే కనీసం లోపలకు పరుగెట్టి తలుపు వేసుకోవాలన్న ఆలోచన కూడా రాలేదు. రెండుకాళ్ళూ పైకెత్తి ఒక్కసారిగా మీదకు దూకబోయింది.

ఎక్కడి నుంచి వచ్చిందో తెలీదు కానీ లోపల్నుంచి అంతులేని బలం తన్నుకొచ్చినట్టు కుడిచేత్తో దాన్ని ఆపుచేశాను. దాని గోళ్ళు నా మోచేతి లోపలకు దిగిపోయాయి. పళ్ళతో మెడ పట్టుకోవటానికి అది ముందుకు వంగింది. దాని నోట్లోంచి భరించలేనంత దుర్వాసన. కడుపులో దేవినట్టు అనిపించింది. కుడిచేయి దాని మొహానికి అందనివ్వకుండా ఎడమ చేత్తో దాని పొట్ట కింద నుంచి పట్టుకొని బలంగా తోశాను. అది వెళ్ళి అరుగు అంచు మీద బలంగా పడి క్రింది బురదలోకి దొర్లింది. ఆ పడటంతో దాని వెన్నెముక విరిగినట్టుంది. వికృతంగా కేకపెట్టి బురదలో గిలగిలా కొట్టుకోసాగింది. దాని గోళ్ళు గిచ్చుకున్నచోట లాల్చీ చిరిగిపోయింది. దాని వైపే చూస్తున్నాను.

దాన్ని నేనూ, అది నన్నూ అలాగే చూస్తూ నిలబడ్డాం.

దాని వెన్నెముక విరగటం గురించి నా అంచనా తప్పు. ఎక్కడినుంచి వచ్చిందో తెలీదుకానీ ఒక్కసారిగా బలం తెచ్చుకొని అది కాళ్ళమీద నిలబడి, అక్కడ నుండి మూడు అడుగుల ఎత్తున ఉన్న అరుగు మీదకు దూకి అదే వేగంతో నా మీదకు లంఘించింది. ఈ పరిణామాన్ని నేను ఊహించలేదు.

---

"అయ్యో, ఇప్పుడెలా ఉందండీ? తరువాత ఏమైంది? ఇది జరిగి ఎంతసేపయింది? డాక్టరు దగ్గరకి వెళ్ళారా? అసలు ఎక్కడ ఉన్నారు మీరు? ఇంత జరిగినా నాకు ఫోన్ చేయలేదేం?" అటు నుండి స్వాతి కంఠం ఆదుర్దాగా వినిపించింది.

"డాక్టరు చేతికి కట్టు కట్టాడు. ప్రమాదమేమీ లేదన్నాడు"

"మీరు వెంటనే బయలుదేరి వచ్చేయండి."

"ఇక్కడి నుండి ఇంటి దగ్గరకు రావాలంటే ముందు ఎడ్లబండి మీదా, తర్వాత బస్సులోనూ, ఆ పైన విమానంలోనూ ప్రయాణం చేయాలి మేడం" అన్నాను నవ్వుతూ.

అట్నుంచి చిన్న సందిగ్ధత. "అసలు మీరు నిజం చెపుతున్నారా? లేక కట్టు కథా?"

స్వాతిని సస్పెన్సులో ఉంచటం ఇష్టంలేక "సరదాగా చెప్పాను" అన్నాను.

అట్నుంచి కొంచెంసేపు నిశ్శబ్దం. "ఏదైనా జోకు చేసినా అవతలివారు కూడా ఆనందించేలా ఉండాలి. ఎంత కంగారు పడ్డానో తెలుసా? ఇంటి అరుగు మీదకు తోడేలు రావటమేమిటి? పిచ్చిదాన్ని. అంతా నమ్మేసాను."

“ఇప్పుడు నేను ఎక్కడ ఉన్నానో తెలుసా? అడవి మధ్య గెస్ట్-హవుస్ లో. దీని పేరు కూడా గమ్మత్తుగా ఉంది. మానస మందిరం అట. ఇక్కడకి తోడేళ్ళూ, నక్కలూ వస్తాయని వాచ్-మెన్ చెప్పాడు. ఇలా జరిగితే ఎలా ఉంటుందా అని సరదాగా చిన్న కథ అల్లి దేవిగారికి చెప్పాను. ఇంతకూ అక్కడ నువ్వు ఏం చేస్తున్నావు?"

"నాకూ నిద్ర పట్టలేదు. బయట వరండాలోకొచ్చి చూస్తే పెద్ద వర్షం. చూస్తూ నిలబడ్డాను. స్కూటర్ల మీద వెళ్ళేవాళ్ళు స్లో చేసి ఆగుతూ ఉంటే లోపలికి వచ్చేసాను. ఇడియెట్స్. ప్రకృతిని కూడా ఆస్వాదించనివ్వరు".

"అర్థరాత్రి అవుతోంది. ఇక వెళ్ళి పడుకో."

"పడుకుంటాను కానీ మీరిక అడ్వంచర్స్ ఏమీ చేయకండి. రేపు పొద్దున్నే బయలుదేరి వచ్చేయండి" అంటూ మాలతి అటునుంచి ఫోను పెట్టేసింది.

ఆకాశం చీలిపోయేలాగ ఒక పెద్ద మెరుపు. ఆ మెరుపులో ఒక స్త్రీ వేగంగా నడుచుకుంటూ రావటం గమనించాను. ఒక క్షణం నేను చూస్తున్నది నిజమా కాదా అని అనుమానం కలిగింది. అంత అర్ధరాత్రి అలా నడిచి వస్తున్నదెవరు?

గేటు మీద చేయి వేసి లోపలకు రాబోతూ వరండాలో నిలబడ్డ నన్ను చూసి తటపటాయించింది. గట్టిగా "ప్లీజ్ కమిన్" అని అరిచాను. వర్షంలో పూర్తిగా తడిసిపోయి ముద్దయిపోయినట్టుంది. "నాగరాజు లేడా?" అని అడిగింది.

"ఔట్ హవుసులో ఉంటాడు. మీరు?" అని అడగబోయి అంతలో ఆగి "ముందు తల తుడుచుకోండి. పూర్తిగా తడిసిపోయారు. నేను ఈలోపు నాగరాజుని పిలుస్తాను" అంటూ ఆమె ఏదో అనబోతూంటే వినకుండా లోపలకు వెళ్ళి టవల్ తీసుకొచ్చి ఇచ్చాను. మొహమాటపడకుండా ఆమె దాన్ని తీసుకోవటం నాకు నచ్చింది.

"మీ పేరు?" అని అడిగాను.

"అరుంధతి" అన్నదామె. ఆ తరువాత నేను అడగబోయే ప్రశ్నలన్నీ ముందే ఊహించుకున్నట్టు "మా ఇల్లు నారాయణపురం. అది స్వయంసిద్ధ మద్య నిషేధ ప్రాంతం. మా నాన్నకి మందు లేకపోతే నిద్ర పట్టదు. సాయంత్రం రామన్నపేట వెళ్ళాడు. ఇప్పటివరకూ రాలేదు. వెతుక్కుంటూ వెళుతూంటే మధ్యలో వర్షం తగులుకుంది. ఇక్కడ వాచ్-మెన్ నాగరాజు నాకు బాగా తెలుసు. వర్షం తగ్గేవరకూ ఉందామని ఇటు వచ్చేసాను. ఈ అతిథిగృహంలో ఈరోజు ఎవరూ ఉంటారనుకోలేదు" చెప్పింది.

"పర్లేదు లెండి. ఇక్కడ రెండు గదులున్నాయి కదా. వర్షం తగ్గేవరకూ ఉండండి. ముందు వేడివేడి టీ తాగుదాం" అన్నాను.

...

అయిదు నిముషాలు గడిచేసరికి ఆమె ఎంతో కలివిడిగా సంభాషించసాగింది. ఒకతే కూతురు. తల్లి కూలీపని చేస్తూ మానేసింది. ఆమెకు క్షయ. తండ్రి చూస్తే వ్యసనపరుడు. పని లేదు. తనే కుటుంబాన్ని పోషించాలి. అక్కడే స్కూల్లో టీచర్గా పనిచేస్తోంది. ఎనిమిదొందలు ఇస్తారు. "...మా అమ్మకి నెలకి ఇంజెక్షన్లకే పదివేలదాకా అవుతుంది. నా జీతం ఎనిమిది వందలు. చూస్తూచూస్తూ తల్లిని పోగొట్టుకోలేను కదా. మా నాన్న చూస్తే ఇలా తయారయ్యాడు. ఏం చేయాలో అర్థం కావట్లేదు" అని కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుంది.

"రాత్రికి ఎంత తీసుకుంటావు?" అడిగాను.

ఆమె చివాలున తలెత్తింది.

నవ్వాను. "చాలా అద్భుతంగా అబద్ధం చెప్పావు కానీ, ఏమాత్రం తెలివైన వాడైనా ఇట్టే పట్టేస్తాడు".

ఆమె మాట్లాడలేదు. రక్తం ఇంకిపోయిన మొహం చూస్తే నేను చీకట్లో వేసిన బాణం సరిగ్గానే తగిలినట్టు అనిపించింది.

అంతకు ముందురోజు ఈ అతిథి గృహంలో దిగినప్పుడు వేస్ట్ బాస్కెట్లో వాడిపోయిన పూవులు కనబడ్డాయి. అది చూసి తడబడిన నాగరాజు "మీ ముందు గదిలో ఒక జంట దిగారండీ. వాళ్ళు పడేసి వెళ్ళిపోయుంటారు. చూసుకోలేదు. క్షమించండి" అన్నట్టు మాట్లాడాడు. విజిటర్స్ బుక్లో సంతకం పెడుతున్నప్పుడు గత వారం రోజులుగా ఈ గెస్ట్-హవుస్ లో ఎవరూ దిగలేదని చూశాను. ఒకటి ఒకటీ కలిపితే రెండయినట్టు ఈ విషయాలన్నీ కలిపితే నాకు విషయం అర్థమయింది. బహుశ నాగరాజు ఈమెకు కబురు చేసి ఉంటాడు. అతనికి కూడా ఇందులో వాటా ఉండి ఉంటుంది.

"మీరు చెప్పింది నిజమే. మూడువేలిస్తే నేను ఈరాత్రికి ఇక్కడే ఉండిపోతాను" అంది.

"ముందు టీ తాగు. తర్వాత మాట్లాడదాం" అంటూ టీ స్టవ్ మీద పెట్టి ఆమెతో సంభాషించాను. అప్పటి వరకూ మర్యాదగా మాట్లాడిన నేను ఏకవచనంలోకి తెలియకుండానో దిగిపోయాను. "ఏం చదువుకున్నావు నువ్వు?"

"బి.ఎస్.సి. స్టాటిస్టిక్స్" అంది. ఈసారి ఆశ్చర్యపోవటం నా వంతయింది. "అంత చదువుకుని..." తర్వాత ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. నా ప్రశ్న అర్థమయినట్లుగా ఆమెచెప్పింది "నా కథంతా నిజమే. అమ్మకి క్షయ. నాన్న తాగుబోతు. వాళ్ళను వదిలేసి నేను పట్నం వెళ్ళి ఏ రెండువేల జీతానికో పని చేస్తే వీళ్ళను చూసుకోవటానికి ఇక్కడ ఎవరూ ఉండరు. అందుకనే మా పల్లెలోనే ఉంటూ నా జీతం రాళ్ళతో వాళ్ళను పోషిస్తున్నాను. పై రాబడి ఎలానూ ఉంటుంది కదా" అంటూ నవ్వింది.

"మీరింత ధైర్యంగా తలుపు తీసుకొని లోపలకు వచ్చేశారు కదా. లోపలున్నవారు ఎవరో తెలీకుండా అలా రావటానికి ధైర్యం ఎలా వచ్చింది?" నాకు తెలియకుండానే తిరిగి బహువచనంలోకి దిగిపోయాను.

"ప్రాణ భయం అడవిలో పులిని కూడా మనిషి ఎదుర్కొనేలా చేస్తుంది. ఆకలి అవసరం ఎంతటి సాహసానికైనా ఒడిగట్టేలా చేస్తుంది. అందుకే రిస్కు తీసుకుంటాం" అంది.

"కానీ నాకు అవసరం లేదని నేను అక్కడికక్కడే వెనక్కు పంపించేస్తే మళ్ళీ వర్షంలో తడుచుకుంటూ ఇంటికి వెళ్ళవలసిందేగా."

"నా అనుభవంలో తొంభై శాతం మగవాళ్ళెవరూ అలా వెనక్కు పంపించలేదు."

"మగవాళ్ళ మీద మీకు చాలా తేలికైన అభిప్రాయం ఉన్నట్టుందే."

"మొగవాళ్ళనే కాదు. ఆడవాళ్ళూ అంతే. పోతే వారు బైటపడరంతే".

"వివాహేతర సంబంధమున్న పురుషులూ, స్త్రీలూ సమాన సంఖ్యలో ఉన్నారంటారా?"

"కొంచెం దాదాపుగా అంతే. ఒక్కొక్క పురుషుడుకీ పదిమంది స్త్రీలతో సంబంధాలున్నాయని అనుకుందాము. ఆ పదిమంది స్త్రీలకూ వివాహేతర సంబంధం ఉన్నట్టేగా..."

నాకు అర్థం కాలేదు.

ఆమె నవ్వుతూ అంది. "ఒక గదిలో వందమంది పురుషులూ, వందమంది స్త్రీలూ ఉన్నారనుకుందాం. వారిలో ఇరవైమంది శ్రీరామచంద్రులూ, ఇరవై మంది సీతలూ ఉన్నరనుకుందాం. మిగతా మీలాంటి ఎనభై మంది కృష్ణులకీ, ఒక్కొక్కడికీ నలుగురు స్త్రీలతో పరిచయం ఉందనుకుందాం. అంటే... అక్కడున్న ఎనభై మంది స్త్రీలల్లో ప్రతి ఒక్క స్త్రీకీ నలుగురు పురుషులతో సంబంధం ఉన్నట్టేగా. అందులో మన భార్య, చెల్లి, వదిన, చివరికి అమ్మ కూడా ఉండొచ్చు..."

సాచిపెట్టి మొహం మీద కొట్టినట్టయింది.

"... ఏం? నేను చెప్పిన లెక్క తప్పంటారా?"

స్టాటిస్టిక్స్ చదివిన అమ్మాయి ఆవిధంగా చెపుతూ ఉంటే, వాదించటానికి నా వద్ద ఇంకేమీ లేదు. లేచి మూడు వేలిచ్చాను.

"రండి గదిలోకి వెళదాం" అంది.

"వెళ్ళి పడుకోండి. పొద్దున్నే లేచి వెళ్ళిపోండి."

"మరి ఈ డబ్బు?"

"నాకు తెలియని ఒక గొప్ప నిజాన్ని చెప్పినందుకు." ...

తెల్లవారింది. మళ్ళీ అదే స్తంభం దగ్గర నిలబడ్డాను. అరుంధతి వెళ్ళిపోయి గంట అయింది. మాలతి దగ్గర నుండి ఫోన్ వచ్చింది. "ఏం బయలుదేరారా?"

"ఆ. ఇంకో గంటలో బయలుదేరుతున్నాను."

"ఏం చేస్తున్నారు?"

"నిన్న రాత్రి నిలబడ్డచోటే నిలబడి..."

"నిన్న రాత్రి చెప్పిన 'తోడేలుతో యుద్ధం' కథ గురించి ఆలోచిస్తున్నారా?"

"అవును. నీకు కథ చెప్పిన తర్వాత నిజంగానే ఒక తోడేలు 'నా మానసమందిరం'లోకి ప్రవేశించబోయింది. కష్టపడి యుద్ధం చేసి బయటకు తోలేశాను."

"మళ్ళీ ఇంకొక కథ అల్లుతున్నారా? చాల్చాలు. తొందరగా బయల్దేరండి" నవ్వుతూ అన్నదామె.

'*నిన్న రాత్రి వర్షంలో నువ్వు కూడా బయట వరండాలో చాలా సేపు నిలబడి ఉన్నావా?*' అని అడగలేదు.

ఫోన్ ఆపు చేశాను. కొన్ని ఇబ్బందికరమైన ప్రశ్నలు అడగక పోవటమే మంచిది. ఎదుటి వారినీ, మనసునీ కూడా..!

.

★★★

(వచ్చే నెల మరో కథతో కలుసుకుందాం)